

మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న పీపానాయక్‌తండా ఉప సర్పంచ్ చంద్రూనాయక్, ఇతర నాయకులు

# బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి

- మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో చేరికలు

సూర్యాపేట టౌన్, నవంబర్ 3 : బీజేపీ నుంచి పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూర్ (ఎస్) మండలం పీపానాయక్‌తండా బీజేపీకి చెందిన ఉప సర్పంచ్ చంద్రూనాయక్, వార్డు మెంబర్ లింగానాయక్‌తో పాటు 40 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరినీ మంత్రి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, నాయకులు కొణతం సత్యనారాయణరెడ్డి, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

### మంత్రి కాన్వాయ్ తనిఖీ..

సూర్యాపేటసిటీ : మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనాన్ని సూర్యాపేట సమీపంలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గల చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి వాహనంతో పాటు కాన్వాయ్‌లోని ఇతర వాహనాలను సైతం పోలీసులు తనిఖీ చేశారు.

## నేడు న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం

తుంగతుర్తి, నవంబర్ 3 : హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని జల విహార్‌లో శనివారం జరిగే తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తుంగతుర్తి లీగల్ సెల్ న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, తాళ్లపెల్లి సత్యనారాయణ, జిలకర చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సమ్మేళనానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు



మోటకొండూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏఓ అనూరాధ

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మోటకొండూర్, నవంబర్ 3 : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి అనూరాధ శుక్రవారం పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి సుబ్బూరి సుజాత, ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో తేజ విద్యార్థుల ప్రతిభ

కోదాడ రూరల్, నవంబర్ 3 : రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో తేజ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. హైదరాబాద్ నగరం హైయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆడిటోరియంలో శుక్రవారం తెలంగాణ, ఏపీకి చెందిన పాఠశాలల విద్యార్థులకు వైల్డ్ విజ్‌డమ్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 37 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణ పరిధి కోమరబండకు చెందిన తేజ విద్యాలయం విద్యార్థులు సిరికొండ జీవనచందు (9వ), శౌర్య తేజ్‌చౌదరి (7వ తరగతి) నాల్గోవ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. విజేతలకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ శాఖ వైస్‌చైర్మన్ పార్థన బహుమతులు అందజేశారు.

# తుంగతుర్తిలో బీఆర్‌ఎస్ ప్రచార జోరు

**ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ విజయం నల్లేరు మీద నడకే**

**9 ఎంపీపీలు, 9 జడ్పీటీసీలు మొత్తం 18 బీఆర్‌ఎస్ పార్టీవే**

**నియోజక వర్గంలో 154 గ్రామ పంచాయతీలకు 133 బీఆర్‌ఎస్, 23 కాంగ్రెస్**



మోత్కూరు : పనకబండలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ శుక్రవారం ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

తిరుమలగిరి, నవంబర్ 3 : నియోజకవర్గంలో ప్రతిపక్షాలకు అందని రీతిలో జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం సాగుతున్నది. ఇప్పటి వరకు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేది ఇంకా ఖరారు కాలేదు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో మొదటి విడత ఎన్నికల ప్రచారం పూర్తి చేయగా.. రెండో విడత ఎన్నికల ప్రచారం కూడా కొనసాగుతున్నది.

### ప్రజల నుంచి విశేష స్పందన..

నియోజక వర్గంలోని తొమ్మిది మండలాల్లో ప్రజల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి, కారు గుర్తుకు విశేష స్పందన లభిస్తున్నది. వృద్ధులు, దివ్యాంగులు, గ్రామాల ప్రజలు గులాబీ జెండా పట్టుకుని ఎన్నికల ప్రచారంలో స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతున్నారు. మహిళలు మంగళ హారతులతో ఎమ్మెల్యేయే కిశోర్‌కుమార్‌కు విజయ తిలకం దిద్ది ఆశీర్వదిస్తూ తమ మద్దతును ప్రకటిస్తున్నారు.

### అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండా..

ప్రజలు సైతం అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకోవాలని ప్రకటిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారం నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. గత 60 ఏండ్లలో జరుగని అభివృద్ధి ప్రస్తుతం కండ్ల ముందు కనిపిస్తుండడంతో మరో మారు బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నారు.

### నియోజకవర్గంలో 9 ఎంపీపీలు, 9 జడ్పీటీసీలు బీఆర్‌ఎస్‌వే..

నియోజక వర్గంలోని 9 మండలాల్లో 9 ఎంపీపీలు, 9 జడ్పీటీసీలు మొత్తం 18 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే ఉన్నారు. అలాగే నియోజకవర్గంలో 154 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 133 గ్రామ పంచాయతీలు బీఆర్‌ఎస్ పాలనలో ఉండగా కేవలం 23 పంచాయతీల్లో కాంగ్రెస్ సర్పంచులు ఉన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా ఉన్న నేపథ్యంలో ఈసారి పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గెలుపు నల్లేరు మీద నడకే అని అంతా భావిస్తున్నారు.

### ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ గెలుపు ఖాయం

ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ గెలుపు దాదాపు ఖాయమైంది. మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఆయన భారీ మెజార్టీతో గెలుస్తారు. నియోజక వర్గంలోని అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది.

– షేక్ మౌలానా, గ్రామస్తుడు, వెలిశాల



### నియోజక వర్గ ప్రజల మద్దతు ఎమ్మెల్యే కిశోర్‌కే

నియోజక వర్గ ప్రజల మద్దతు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కే ఉంది. ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమమే ఆయనను మూడోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల మధ్య ఉండి ప్రజాసేవకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఏకైక వ్యక్తి కావడంతో ఎమ్మెల్యే గెలుపు ఖాయం.

– కందుకూరి లక్ష్మయ్య, గ్రామస్తుడు, తిరుమలగిరి





నాగారం : వర్ధమానుకోటలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ పరశురాములు



మద్దిరాల : గోరెంట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహారావు

# బీఆర్‌ఎస్ గెలుపుతోనే మరింత అభివృద్ధి

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మోత్కూరు, నవంబర్ 3 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గెలుపుతోనే మరింత అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పనకబండలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ప్రతి నిత్యం ప్రజల మధ్యన ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధికి పాటు పడుతున్న కిశోర్‌ను గెలిపించడం కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అలాగే మున్సిపాలిటీ కేంద్రంలోని పలు బూత్‌ల్లో, మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పనకబండ సర్పంచ్ బత్తిని తిరుమలేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు లోతుకుంట స్వామి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేశ్ పాల్గొన్నారు.

### మద్దిరాల మండలంలో విస్తృత ప్రచారం..

మద్దిరాల : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గోరెంట్ల గ్రామంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సూరినేని నర్సింహారావు ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అలాగే చిననెమిల, మామిండ్లమడవ, మద్దిరాల, గుమ్మడవెల్లి, రామచంద్రాపురం, పోలుమళ్ల గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### వర్ధమానుకోటలో..

నాగారం : మండలంలోని వర్ధమానుకోటలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కలెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ మూడోసారి గెలిపించాల్నీ కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వర్ధమానుకోట ఎంపీటీసీ-2 వడ్డే పరశురాములు, ఉప సర్పంచ్ ఈదుల కిరణ్‌కుమార్, జలంధర్, వినయ్, మల్లేశ్, మహేందర్ పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఏడుగురి అరెస్ట్

- 1,250 గ్రాముల గంజాయి స్వాధీనం

కోదాడ రూరల్, నవంబర్ 3 : మండలంలోని దోరకుంట శివారులో గల సెల్ టవర్ వద్ద గంజాయి సేవిస్తున్న ఏడుగురు యువకులను రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు తమ మిత్రుడి ఆటోలో వెళ్లి భద్రాచలం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 4 కేజీల గంజాయిని రూ.6 వేలకు కొనుగోలు చేశారు. దాన్ని సెల్ టవర్ వద్ద దాచిపెట్టారు. 2 కేజీల గంజాయిని కోదాడ యువకులకు అమ్మి మిగిలిన గంజాయిని రోజూ సిగరెట్‌లో నింపి అమ్ముతూ, తాగుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రైడ్ చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1,250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.3,250 ఉంటుందని రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.